## క్లుప్తంగా

### పోషకాహారంతోనే ఆరోగ్యం



సీమంతం నిర్వహిస్తున్న దృశ్యం

**ఏన్కూరు:** పోషకాహారంతోనే చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీఓ దయామణి అన్నారు. గురువారం మండలంలోని తిమ్మారావుపేట సెక్టార్ ఆధ్వర్యంలో అన్నప్రాసనలు, సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు, గర్భిణులు సరైన పోషకాహారం తీసుకుంటే రోగాల బారిన పడకుండా ఉండటమే కాకుండా ఆరోగ్యవంతమైన పిల్లలకు జన్మనివ్వొచ్చన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు భవాని, బక్కమ్మ, అంగన్‌వాడీ టీచర్లు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

### వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ

**వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలో గల హనుమాన్‌బజార్‌లో ఉన్న శ్రీ మహాలక్ష్మీ ఆలయంలో వచ్చే 3వ తేదీ నుండి 12 వరకు నిర్వహించే శ్రీదేవి శరన్నవరాత్రి గోడపత్రికలో శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. 10 రోజుల పాటు నిర్వహించే ఈ శరన్నవరాత్రి ఉత్సవాలలో అమ్మవారిని వివిధ వేషధారణలో అలంకరించడంతో పాటు ప్రతి రోజు బతుకమ్మ ఆటపాటలు నిర్వహించనున్నట్లు వివరించారు. పలు రకాల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందచేయనున్నట్లు తెలిపారు. ఆలయ కమిటీ ఛైర్మన్ బండారు తిరుపతిరావు, పల్లపు కొండలు, ఓర్సు శ్రీను, దుర్గ, వేముల కోటేశ్వరరావు, రాములు, బాలయ్య, అంజనేయులు, అర్చకులు బొడ్డుపల్లి వాసు దేవశాస్త్రి, రంగు బట్ట రాజశేఖర్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

### పెండింగ్ డీఏలను విడుదల చేయాలి

**ఏన్కూరు:** పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి గరికె శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మండలంలోని జన్నారం, ఏన్కూరు, తిమ్మారావుపేట బురదరాఘవాపురం, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం పాఠశాలలను గురువారం సందర్శించి మాట్లాడారు. పీఆర్‌సీని ప్రకటించాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, గురుకుల పాఠశాలల్లో ప్రత్యేక వార్డెన్ పోస్టులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ నాయకులు ఫ్రాన్సిస్, వెంకటప్పయ్య, కుమారస్వామి, శ్యామల, సరస్వతి పాల్గొన్నారు.

### షిర్డీ సమాచార కేంద్రం ఏర్పాటు చేయాలి

**సత్తుపల్లిరూరల్:** షిర్డీ సాయి సంస్థాన్ ట్రస్ట్ సమాచార కేంద్రాన్ని విజయవాడలో ఏర్పాటు చేయడం ద్వారా సాయి భక్తులకు సౌకర్యంగా ఉంటుందని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ మాజీ డైరెక్టర్ భీమిరెడ్డి పుల్లారెడ్డి గురువారం షిరిడీలో ట్రస్ట్ ఉప కార్య నిర్వాహణాధికారి తుకారం భావులేకు వినతిపత్రం అందించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి సాయినాథుని దర్శనం కోసం ఎక్కువ మంది భక్తులు వస్తున్నారన్నారు. ఈ సమాచార కేంద్రంలో హైదరాబాద్‌లో మాత్రమే ఉందని.. విజయవాడలోనూ ఏర్పాటు చేయాలని కోరారు. లక్షలాది మంది భక్తులకు ఈ సమాచార కేంద్రం ద్వారా ఉపయోగం ఉంటుందన్నారు.

### జేవీఆర్ కళాశాలలో ఎన్‌సీసీ ఎంపికలు

**సత్తుపల్లిటౌన్:** సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు ఎన్‌సీసీలో ప్రవేశాల కోసం గురువారం 11వ బెటాలియన్ ఖమ్మం కమాండెంట్ ఆఫీసర్ సంజయ్‌కుమార్‌భద్ర ఎంపిక పరీక్షలు నిర్వహించారు. జేవీఆర్ కళాశాలతో పాటు దమ్మపేట ట్రైబల్ డిగ్రీ మహిళా కళాశాల విద్యార్థినులు ఈ ప్రవేశాలకు హాజరయ్యారు. విద్యార్థులకు దేహదారుఢ్య పరీక్షతో పాటు మౌఖిక రాతపరీక్షలు నిర్వహించారు. 50మంది విద్యార్థులను ఎన్‌సీసీకి ఎంపిక చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.గోపి, ఎన్‌సీసీ ఏఓ నవీన్‌యాదవ్, లలిత్ సింగ్, కేర్‌టేకర్ రవికుమార్ పాల్గొన్నారు.

### దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్‌లు పంపిణీ



బస్‌పాస్‌లు అందిస్తున్న సత్తుపల్లిరూరల్ సీఐ ముత్తి లింగం గౌడ్

**పెనుబల్లి:** సత్తుపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో మండలంలోని దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్‌లు పంపిణీ చేశారు. వీయంబంజర్ రాజసాయి మందిరం ఆధ్వర్యంలో క్యాంపు నిర్వహించి, దివ్యాంగులు చెల్లించాల్సిన 50 శాతం రుసుమును రాజసాయి మందిరం ద్వారా చెల్లించి 160 మందికి ఉచిత బస్‌పాస్‌లను అందించారు. కార్యక్రమంలో సత్తుపల్లి రూరల్ సీఐ ముత్తి లింగం గౌడ్, ఎస్సై వెంకటేష్‌లు హాజరై ఉచిత బస్‌పాస్‌లు అందించారు. ఈ కార్యక్రమంలో రాజసాయి మందిరం నిర్వాహకులు జెన్నారెడ్డి నరసింహారెడ్డి, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

## పంటలకు ప్రాణం పోసిన.. సాగర్ జలాలు



సాగర్ కాల్వ 72వ కిలోమీటర్ కప్పలబంధం రెగ్యులేటర్ వద్దకు చేరిన జలాలు

**కల్లూరురూరల్:** నాగార్జునసాగర్ జలాలు పంటలకు ప్రాణం పోశాయి. గత 20 రోజుల నుంచి సాగర్ జలాలు బంద్ కావడంతో సాగర్ ఆయకట్టు కింద వేసిన వరి, మిర్చి, పత్తి, చెరకు పంటలు ఎండిపోయే పరిస్థితికి చేరటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందారు. సాగర్ కాల్వకు పాలేరు వద్ద పడిన గండి ఎట్టకేలకు పూడ్చి సాగర్ కాలువకు నీరు విడుదల చేయడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

**మండలాలకు చేరిన జలాలు..**

గురువారం కల్లూరు సమీపంలోకి కప్పలబంధం మెయిన్ కెనాల్ హెడ్ రెగ్యులేటర్ వద్ద 72వ కిలోమీటర్‌కు 860 క్యూసెక్కుల నీరు చేరడంతో మధిర బ్రాంచ్ కెనాల్‌కు 600 క్యూసెక్కుల నీరు విడుదల చేసి, మెయిన్ కెనాల్‌కు 260 క్యూసెక్కుల నీరు వదిలారు. మరో 200 క్యూసెక్కుల నీరు పెరిగినట్లెతై పుణ్యపురం మేజర్ కాలువకు కూడా నీరు విడుదల చేసేందుకు ఇరిగేషన్ శాఖ అధికారులు సమాయత్తమయ్యారు. మధిర బ్రాంచ్ కెనాల్ 10 కిలోమీటర్ల వరకు నీరు సరఫరా అవుతుంది. ఈ నీటి ప్రవాహం 600 నుంచి 800 క్యూసెక్కుల నీటి ప్రవాహం పెరిగి 20 కిలోమీటర్ వరకు వెళ్లినట్లయితే పుణ్యపురం మేజర్‌కు కూడా నీరు సరఫరా చేయనున్నారు. పుణ్యపురం మేజర్ కల్లూరు నుంచి 15 కిలోమీటర్ల దూరం వరకు ఉండటంతో ప్రస్తుతం వస్తున్న నీటి ప్రవాహం సరిపోవటం లేదు. పాలేరు వద్ద సాగర్ ఎడమ కాలువకు 2,500 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా కల్లూరు సమీపంలోని కప్పలబంధం వద్ద గల 72వ కిలోమీటర్‌కు 860 క్యూసెక్కుల నీరే చేరాయి. గురువారం రాత్రి లేక శుక్రవారం కల్లా మరో 300 క్యూసెక్కుల నీరు పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

- సాగర్ జలాలు ఇప్పటికైనా చేరడం వల్ల పంట పొలాలు రక్షించుకునేందుకు అవకాశం ఉంది.



సాగర్ ఆయకట్టు కింద సాగవుతున్న వరిపంట



మధిర బ్రాంచ్ కెనాల్‌లో సాగర్‌నీరు

ఇప్పటికే నీటి ఎద్దడి వల్ల వరి పంట చాలా వరకు రైతులు నష్టపోయారు. వరితో పాటు పత్తి, మిర్చి, చెరకు పంటలకు కూడా నీరు ప్రాణం పోసింది. మరో నాలుగు రోజుల్లో పూర్తిస్థాయిలో మధిర బ్రాంచ్ కెనాల్‌కు 900 క్యూసెక్కులకుపైగా నీరు విడుదల చేసే అవకాశం ఉంది. దీంతో పంటలకు పుష్కలంగా నీరు అందుతుంది. సాగర్ ఆయకట్టుతో పాటు లిఫ్ట్ ఇరిగేషన్ కింద వేసిన పంట పొలాలకు కూడా సాగర్‌నీరు అందుతుంది.

## సేవా కార్యక్రమాల్లో ఆర్యవైశ్యుల ముందజ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

**వైరా:** ఆర్యవైశ్యులు ఇతరుల పట్ల స్నేహ పూర్వకంగా వ్యవహరిస్తూ అవసరమైనప్పుడు అండగా నిలుస్తారని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. వైరాలోని వాసవీ కల్యాణ మండపంలో శుక్రవారం ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కల్వ సుజాత సన్మాన సభను నిర్వహించగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్యవైశ్యులకు న్యాయం చేయాలనే ఉద్దేశ్యంతో ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం కల్వ సుజాతను ఘనంగా సన్మానించారు. అంతకు ముందు సుజాతకు ఆర్యవైశ్యులు భారీ ర్యాలీతో స్వాగతం పలికి గజమాలతో సత్కరించారు. మార్కెఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, కట్లరం గారావు, మిట్టపల్లి నాగి, శీలం వెంకటనర్సిరెడ్డి, మిట్టపల్లి కిరణ్‌కుమార్, మిట్టపల్లి శ్రీనివాసరావు, పెనుగొండ ఉపేంద్రరావు, రాయల నారాయణరావు, బండారుపల్లి కృష్ణారావు, కొణతం రాజారావు పాల్గొన్నారు.

### ఐదు రోజుల రిమాండ్

**వైరా:** వైరాలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన బసవ అప్పలరాజును మధిర కోర్టులో హాజరు పర్చగా ఫస్ట్ అడిషనల్ కోర్టు మేజిస్ట్రేట్ కార్తీక్ డ్రంక్ డ్రైవ్‌లో పట్టుబడిన అప్పలరాజుకు ఐదు రోజుల రిమాండ్ విధించారు. కోర్టు కానిస్టేబుల్ నరసింహారావును పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారు.

### ప్రజా సమస్యలు పరిష్కరించాలి

**ఏన్కూరు:** ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మెరుగు సత్యనారాయణ కోరారు. గురువారం మండలంలోని ఆరికాయలపాడులో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వం మాదిరిగానే ఈ ప్రభుత్వం కూడా ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగేశ్వరావు, మధు, కృష్ణ, రాము పాల్గొన్నారు.

## వాహనదారులు నిబంధనలు పాటించాలి



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై సూరజ్

**కొణిజర్ల:** వాహనదారులు ప్రభుత్వ నియమావళికి అనుగుణంగా నడుచుకోవాలని ఎస్సై సూరజ్ అన్నారు. గురువారం సాయంత్రం కొణిజర్ల పోలీస్ స్టేషన్ సమీపంలో ఆయన వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అద్దాలకు బ్లాక్ ఫిల్మ్ వేసుకుని వస్తున్న కార్లు ఇతర వాహనాలు ఆపి ఫిల్ములు తీసివేయాలని సూచించారు. 30 శాతానికి మించిన ఫిల్ములు వేయకూడదన్నారు. నంబర్ ప్లేట్ లేకుండా, సరైన ధృవ పత్రాలు లేకుండా ప్రయాణం చేస్తే వాహనాలు సీజ్ చేయడం జరుగుతుందన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### ఎంఈఓకు యూటీఎఫ్ నాయకుల సన్మానం

**ఎర్రుపాలెం:** మండల విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన మురళీమోహన్‌కి గురువారం యూటీఎఫ్ మండల కమిటీ అధ్యక్షులు బండారు నాగరాజు, ప్రధాన కార్యదర్శులు శాలువాలతో సన్మానం చేశారు. పాఠశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కంచర్ల శ్రీనివాసరావు, కోశాధికారి నాగేశ్వరరావు, సంఘం నాయకులు అజయ్‌కుమార్ సుబ్బరామరాజు, నాగేశ్వరరావు రవికుమార్ తదితరులున్నారు.

## వ్యసనాలకు దూరంగా ఉండాలి



బ్యానర్ ప్రదర్శిస్తున్న దృశ్యం

**మధిర:** యువత చెడు వ్యసనాలకు బానిస కావొద్దని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆరోగ్య పర్యవేక్షకుడు (మధిర ఆశమిత్ర) లంకా కొండయ్య అన్నారు. పట్టణంలో స్థానిక టీవీఎం హైస్కూల్‌లో జరిగిన మధిర డివిజన్ జోనల్ క్రీడలకు హాజరైన వివిధ మండలాలకు చెందిన హైస్కూల్ విద్యార్థులకు లంకా కొండయ్య ఆధ్వర్యంలోని బృందం నో గంజా.. నో డ్రగ్స్ అంటూ బ్యానర్‌తో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ ఐలూరి వెంకటేశ్వరరెడ్డి, జోనల్ క్రీడల కమిటీ నిర్వాహకులు ఎంఈఓ ప్రభాకర్‌రావు, వ్యాయామ ఉపాధ్యాయులు విజయభాస్కర్, రమేష్, జమలయ్య, సాంబశివరెడ్డి, సత్యనారాయణరెడ్డి, నాగేశ్వరరావు, అజీమ్, చిన్ని విజయరాజు, నరేష్, చైతన్య, జయాకర్, మాటూరు స్కూల్ హెచ్‌ఎం శ్రీహరి ఉన్నారు.

### ఆంబోతుకు అంత్యక్రియలు

**ఏన్కూరు:** మండలంలోని తూతకలింగన్నపేటలో గురువారం ఆంబోతుకు ఘనంగా అంత్యక్రియలు నిర్వహించారు. గత 13 ఏళ్లుగా గ్రామ దేవతగా కొలుస్తున్న ఆంబోతు అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేసి ట్రాక్టర్‌పై గ్రామంలో ఊరేగింపు చేశారు. గ్రామ సమీపంలో ఆంబోతును ఖననం చేశారు.

### వరద బాధితులకు ఆర్థిక సాయం

**చింతకాని:** మండలంలోని నేరడ గ్రామపెద్దలు వరద బాధితులకు సహాయార్థం రూ.30,087 నగదును ఖమ్మం కలెక్టర్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్‌కు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్నేరు వరద బాధితులను ఆదుకునేందుకు నేరడ గ్రామ యువత వాట్సాప్ గ్రూప్ ద్వారా సేకరించిన నగదును అందజేయటం జరిగిందన్నారు. కార్యక్రమంలో నేరడ గ్రామ మాజీ ఉపసర్పంచ్ గోపాలరావు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

- **కల్లూరురూరల్:** ఖమ్మం వరద బాధితుల సహాయార్థం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి పిలుపు మేరకు కల్లూరు మండలంలోని లింగాల గ్రామ కాంగ్రెస్ నాయకులు 18 వేల రూపాయల నగదు, 8 క్వింటాళ్ల బియ్యాన్ని సేకరించి గురువారం ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌లకు అందజేశారు. నాయకులు సత్యంబాబు, వెంకటేశ్వరరావు, పసుమర్తి చందర్‌రావు పాల్గొన్నారు.

### సెమిస్టర్ ఫలితాల్లో మిస్ట్ విద్యార్థుల ప్రతిభ

**సత్తుపల్లిరూరల్:** 2023–04 విద్యా సంవత్సరంలో గత ఆగస్టు నెలలో నిర్వహించిన ఎంబీఏ ద్వితీయ సంవత్సరం రెండో సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో (జేఎన్‌టీయూహెచ్) స్థానిక మదర్‌థెరిస్సా అటానమస్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఉత్తమ ఫలితాలను సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరికృష్ణ తెలిపారు. వీరిలో గడ్డం అపర్ణ, నూనావత్ చెన్నమ్మ, పగడాల జయప్రకాష్, వారా కీర్తి, శ్రీరూపా, మార్తా రమ్య, పోయల మణి, శ్రీరాముల సంధ్యారాణిలు అత్యధిక గ్రేడ్‌లు సాధించారు. వీరిని కళాశాల సెక్రటరీ చలసాని సాంబశివరావు, చైర్మన్ సత్యనారాయణ, ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ జాకీర్ హుస్సేన్, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ రామచంద్రరావు, ఎంబీఏ విభాగం అధిపతి డాక్టర్ టి.రవీంద్రారెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

### 'అభివృద్ధిపై శ్రద్ధలేదు'



మాట్లాడుతున్న బొంతు రాంబాబు

**వైరా:** వైరా మున్సిపాలటీ కమిషనర్ల బదిలీపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిలో లేదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు విమర్శించారు. మున్సిపాలిటీ పరిధిలోని గండగలపాడులో పల్లె బోయిన కృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సీపీఎం గ్రామ సభలో ఆయన మాట్లాడారు. వైరా మున్సిపాలిటీ ఏర్పడి ఆరు సంవత్సరాలు పూర్తైయినా ఇప్పటి వరకు 12 మంది కమిషనర్లు వచ్చి బదిలీ అయినట్లు తెలిపారు. అంతకు ముందు పార్టీ సీనియర్ నాయకులు వాసిరెడ్డి విద్యాసాగర్‌రావు పార్టీ జెండాను ఆవిష్కరించారు. సుధాకర్, చలపతిరావు, రామారావు, నర్సింహారావు, సుధీర్‌బాబు, పాల్గొన్నారు.

### సింగరేణి డైరెక్టర్‌కు వినతి

**సత్తుపల్లిరూరల్:** సత్తుపల్లి జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీ, సీహెచ్‌పీ, డిస్పెన్సరీ, పీవీ నరసింహారావు కాలనీలలోని సింగరేణి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డికి ఐఎన్‌టీయూసీ నాయకులు గురువారం వినతిపత్రం అందించారు. సత్తుపల్లి నుంచి సుమారు 12.4 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా చేస్తున్నా ఉద్యోగుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి వెంటనే జీఎం కార్యాలయం సత్తుపల్లిలో ప్రారంభించాలని కోరారు. ఇన్‌సెంటివ్ వెంటనే ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమస్యలను పరిష్కరిస్తామని డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ సెక్రటరీ తీగల క్రాంతికుమార్, నాగప్రకాష్, ఫిట్ సెక్రటరీలు బాలాజీ, రామారావు, నాగేశ్వరరావు, నాయకులు అశ్వక్, శ్రీనాథ్, గోపీనాథ్, రామచందర్ పాల్గొన్నారు.

## ప్రజలకు అందుబాటులో ఉండండి



ఎమ్మెల్యే రాగమయికి వినతిపత్రం అందజేస్తున్న ఏఈఓలు

**సత్తుపల్లిటౌన్:** గ్రామాల్లో ప్రజలకు పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించాలని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి ఆదేశించారు. గురువారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో కల్లూరు మండల పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజలు దరఖాస్తు చేసుకున్న సర్టిఫికెట్లను సత్వరమే అందించాలని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను అవినీతికి ఆస్కారం లేకుండా ప్రజలకు సక్రమంగా అందేవిధంగా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్, ఏఎంసీ చైర్మన్లు ఆనంద్‌బాబు, నీరజ, చందర్‌రావు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే రాగమయికి ఏఈఓల వినతి..**

పని ఒత్తిడి తగ్గించాలని కోరుతూ గురువారం ఎమ్మెల్యే రాగమయిని కలిసి నియోజకవర్గంలోని వ్యవసాయ విస్తరణ అధికారులు వినతిపత్రం అందించారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యను మంత్రి తుమ్మల, రాష్ట్ర ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కాగా కిష్టాపురం కాంగ్రెస్ నాయకులు ఆరు క్వింటాళ్ల బియ్యం ఖమ్మం వరద బాధితల సహాయార్థం ఎమ్మెల్యేకు అందించారు.

## పంచాయతీ కార్మికులకు వైద్యపరీక్షలు



పెనుబల్లి: పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

**కొణిజర్ల:** స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొణిజర్ల, పెద్దగోపతి పీహెచ్‌సీలలో గురువారం పంచాయతీ కార్మికులకు ఆరోగ్య సంరక్షణ నిమిత్తం వైద్య పరీక్షలు నిర్వహించారు. పంచాయతీ కార్మికులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రోజారాణి, ఎంపీఓ రాజేశ్వరి, వైద్యాధికారులు రమేష్, రాధాకృష్ణ, ఆయా పంచాయతీల పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

- **పెనుబల్లి:** మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న మల్టీ పర్పస్ వర్కర్లకు, పారిశుద్ధ్య కార్మికులకు లంకాసాగర్ పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం పరీక్షలు నిర్వహించారు. 117 మంది కార్మికులకు రక్త నమూనాలు సేకరించి పరీక్షల కోసం ఖమ్మం హబ్‌కు పంపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అన్నపూర్ణ, తహసీల్దార్ గంటా ప్రతాప్, మండల పంచాయతీ అధికారి ఉపేంద్రయ్య, సూపర్‌వైజర్ నాగేశ్వరరావు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

### అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలకు..

**తల్లాడ:** తల్లాడ పీహెచ్‌సీలో గురువారం అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషక లోపాలున్న పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. తల్లాడ, మిట్టపల్లి, కుర్నవల్లి, నూతనకల్ అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార లోపం ఉన్న పిల్లలకు వైద్యాధికారి రత్న మనోహర్ పరీక్షలు నిర్వహించి తగే జాగ్రత్తలను సూచించి మందులు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పెద్ద పుల్లయ్య, కమల, భద్రమ్మ, సూపర్‌వైజర్ రోజాకుమారి, సత్యావతి, హరీష్ పాల్గొన్నారు.

### ధరణిలో నమోదు ఆధారంగానే రుణాలు



సొసైటీ చైర్మన్ శ్రీనివాసరావు

**కారేపల్లి:** బ్యాంకు, సొసైటీల ద్వారా రైతులకు అందిస్తున్న పంట రుణాలను సద్వినియోగం చేసుకోవాలని, ధరణిలో నమోదైన రైతుల జాబితా ప్రక్రియ ద్వారానే రుణాలు పంపిణీ చేయనున్నట్లు కారేపల్లి సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు అన్నారు. గురువారం కారేపల్లి సొసైటీ కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ.. కారేపల్లి సొసైటీలో 1,310 మంది రైతులకు రూ.5.13 కోట్లు ప్రభుత్వం రుణమాఫీ చేసిందని, వారిలో 828 మంది రైతులకు రూ.3.84 కోట్లు తిరిగి రుణాలు ఇవ్వడం జరిగిందన్నారు. మల్టీ బ్యాంకులలో రుణాలు ఉన్న రైతులు ఒకే బ్యాంకులో రుణాలు ఉండేలా చూసుకోవాలన్నారు. దీంతో రైతు చెల్లించిన 7శాతం వడ్డీలో 3శాతం వడ్డీ రాయితీ వస్తుందని తెలిపారు. సొసైటీలోని రైతులకు మరింత ఋణ సౌకర్యం కల్పించడానికి డీసీసీబీ నిధులు మంజూరు చేసిందని, వాటిని సొసైటీ పాలక వర్గం తీర్మాణం ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. రైతులు తప్పనిసరిగా తమ పంట రుణాలను రెన్యూవల్ చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సొసైటీ కార్యదర్శి బొల్లు హన్మంతరావు పాల్గొన్నారు.

### సాయినాధుడికి ప్రత్యేక పూజలు

**ఎర్రుపాలెం:** మండలంలోని తక్కెళ్లపాడు, భీమవరం, ఎర్రుపాలెం గ్రామాల్లోని ఆలయాల్లో సాయినాధుడికి గురువారం అర్చకులు సాంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా పూజలు చేశారు. పంచామృతాలతో అభిషేకాలు చేశారు. భక్తులు బాబాని దర్శించుకొని పూజలు జరుపుకోగా.. అర్చకులు భక్తులకు అందజేశారు. మండలకేంద్రంలోని ఆలయంలో సిద్ధంశెట్టి శివాంజనేయులు, ఖరీదు నరేష్ దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మహిళా చట్టాలు అమలు చేయాలి



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సరళ

**సత్తుపల్లిరూరల్:** మహిళా రక్షణ చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలని అప్పుడే మహిళల హక్కులు పరిరక్షించబడతాయని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ అన్నారు. గురువారం సత్తుపల్లి మండలం సిద్ధారంలో జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు చేస్తున్నామని చెపుతున్నప్పటికీ ఈ చట్టాలు నిష్పక్షపాతంగా అమలు చేయటం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని చెప్పి మోసం చేసిందని ఆరోపించారు. ఐద్వా జెండాను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఐద్వా నాయకులు వై.పార్వతి, జాజిరి జ్యోతి, రేసు లక్ష్మి, జాజిరి శ్రీను, నాగమణి, మారేశ్వరి, నాగేంద్ర, సత్యవతి, వాసం నిర్మల, వెంకటరమణ, రాణి పాల్గొన్నారు.

## వీరనారి చాకలి ఐలమ్మ

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను మండలాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజా సంఘాల నాయకులు ఆయా మండలకేంద్రాల్లోని పార్టీ, సంఘ కార్యాలయాల్లో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ.. ఉద్యమ పోరాటాల్లో మహిళలు పాత్ర అసమానతమైనది అని చాటి చెప్పిన యోధురాలు ఐలమ్మ అని ఆమె సేవలను కొనియాడారు.

– సాక్షి నెట్‌వర్క్



సత్తుపల్లిటౌన్: ఐలమ్మ విగ్రహం వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాగమయి



మధిర: తహసీల్‌లో..



కొణిజర్ల: ఎంపీడీఓ కార్యాలయంలో ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు



పెనుబల్లిలో..



ముదిగొండ: తహసీల్‌లో..



ఎర్రుపాలెం: రాజులదేవరపాడులో..



కారేపల్లి: నివాళులర్పిస్తున్న రజక సంఘం నాయకులు



సత్తుపల్లిరూరల్: బెటాలియన్‌లో నివాళులర్పిస్తున్న కమాండెంట్ చటర్జీ



తల్లాడ: నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ చంద్రమౌళి, ఎంపీఓ శ్రీదేవి